# పెళ్లిలో మర్యాద

"మనం కూడా వెళ్దామే అమ్మా" అని జడ వూలు వేళ్లతో మెలివేస్తూ అడిగింది శ్యామ. చినిగిన గౌనూ, రేగిన జుట్టూ, మాసిన పరికిణీ ఆ ఎనిమిదేళ్ల పిల్లకళ్లలోని చిలిపి నవ్వుని కొంచెం కూడా మరుగుపరచలేక పోతున్నయ్. బోసి చేతులతోనూ, దిసిమెడతోనూ వున్న శ్యామకి ఆ చిలిపిచూపులే ఆభరణాలు.

తల్లి అవుననీ కాదనీ అనలేదు. "పోయి వాళ్లసుందరితో ఆడుకోవే" అంది కొంచం విసుగ్గా.

శ్యామ అక్కడ్నుంచి కదల్లేదు. "వెళ్దామే అమ్మ. అంతా వెళ్తున్నారే" అని మారాంచేస్తూ అడిగింది.

అవును, అంతా వెళ్ళుతున్నారు. శ్యామ పెద్దనాన్నగారి పెద్దకూతురి పెళ్లి. పదివేలు కట్నంట. చాలా వైభవంగా జరుగుతుంది పెళ్లి. దూరపు చుట్టాలంతా చూసివద్దామని బయలు దేరుతున్నారు. అందరితోపాటు శ్యామతల్లి సావిత్రి పేరకూడా ఒక శుభలేఖ వచ్చింది. అంతేకాని వేరే పిలుపు రాలేదు. పిలుపు వస్తుందని సావిత్రమ్మ ఆశించలేదు. కాని పిలవకుండా శుభలేఖ వచ్చింది గదా తగుదునమ్మా అని బావగారి గుమ్మంతొక్కటానికి ఆవిడకి సుతరామూ మనసొప్పటంలేదు. తన భర్త మంచంపట్టి రెండేళ్ళు తీసుకుని అతిదీనావస్థలో తనని నట్టేట్లో ముంచి కళ్ళు మూసుకున్నాడు. అటువంటి ఆపదలోకూడ తోడుకోడలు గాని, బావగారుగాని వచ్చి తమ ముఖంచూసిన పాపానపోలేదు. డబ్బుకి ఎంతో కటకటపడుతున్నా కూడా అన్నగారికి వ్రాయకూడదా అని

ఎవరైనా అంటే తనభర్త మండిపడేవాడు. ఆయన జబ్బుకి ఆఖరికి తనమెళ్ళోపుస్తె అమ్మటానికయినా ఆయన ఒప్పుకొన్నాడు కాని అన్నగారిని చెయ్యిచాచి ఒక్కపైసా అడిగి ఎరుగడు. తోడు కోడలు బాగా వున్నయింటి ఆడపడచు, ఆవిడచూపు ఆకాశంలోనే వుంటుంది. హోదాగల వాళ్ళతోనూ,— తాహతుగల వాళ్ళతోనూ తప్ప ఇతరులతో నోరువిప్పి మాట్లాడితే ముత్యాలు రాలిపో తయ్యనుకుంటుంది. కొత్తరకం చీరెలమీదికీ కొత్తమోస్తరు నగల మీదికీ తప్ప ఆవిడ బుద్ధి ఇంకోదానిమీదకే పోదు. అటువం టప్పుడు ఎవరి ఆదరం లభిస్తుందని తను పెళ్లికి బయలుదేరాలి ? అంత గొప్పవారింటికి పెళ్లికి వెళ్లడానికి కనీసం శ్యామకి ఒక్క మంచి గౌనుకూడా లేదు. చిరిగిన గౌనులూ, వెలిసిన పరికిణీలూ, వేసుకుని ఏ ముఖంతో వెళ్తుంది ?

"అల్లా పేచీలు పెట్టరాదమ్మా. బళ్లోకి పో శ్యామా" అని కూతురి తలను చేతుల్తో నిమురుతూ, ముఖంమీదికి జారిన ముం గురులని సవరిస్తూ చెప్పింది సావిత్రమ్మ.

ఎప్పుడూ తల్లిమాటకి ఎదురుతిరగని శ్యామ "అంతా వెళ్తున్నారమ్మా. పెద్దనాన్నగారు ఎల్లావుంటారమ్మా ? ఇక్కడికి ఎప్పుడూ రారేమమ్మా ?" అని అమాయకంగా అడిగింది.

తల్లికి ఏంచెప్పటానికి తోచలేదు. ఆ పసిమనసు నొచ్చుకో కుండా ఎల్లా చెప్పాలో పాలుపోలేదు. పెళ్లికెళ్లాలని శ్యామ ఉబ లాటపడటంలో వింతేమీలేదు. అందులో సాక్షాత్తూ పెత్తండ్రిగా రింట్లో పెళ్లి. ఒకరిముఖా లొకరు చూసుకోకపోయినా రక్తంలో ఎక్కడ దాక్కుని వుంటయ్యో ఈ ఆపేక్షలు ? పైగా ఊళ్లో దూరపు చుట్టాలంతా తరలి వెళ్తున్నప్పుడు శ్యామ సరదాపడటంలో ఆశ్చర్య మేముంది ? పోనీ ఎవరితోనైనా దాన్ని ఒకత్తెనే పంపు

దామా అనుకుందిసావిత్రమ్మ. కాని తనని విడిచి అది క్షణంకూడా వుండదు. దానికి తల్లీ, తండ్రీ, సమస్తప్రపంచమూ అమ్మే. అమ్మ పక్కలోదూరి మెడకి చేతులు చుట్టేసు కొంటేకాని దానికి నిద్ర రాదు. నాన్నతోబాటు అమ్మకూడా వెళ్లిపోతుందేమో నన్నట్లుగా తెల్లవార్లూ అమ్మకోసం పలవరిస్తునే వుంటుంది. క్షణంసేపు కాస్త ఎడంగా జరిగి పడుకుంటే అమ్మా అని ఉలిక్కిపడి లేస్తుంది. అది నిమిషం దగ్గిర లేకపోతే తనకీ పిచ్చెక్కినట్లుగా వుంటుంది. అదీగాక అక్కడ ఎవరేమంటే దాని పసిమనసు ఏం నొచ్చుకుం టుందో అని భయం.

ఎటూ తెగటంలేదు. ఏమీ పాలుపోవడంలేదు. తీరా వెళ్తే ఎటువంటి సత్కారం జరుగుతుందో? అంతమందిలో తనకీ, పిల్లకీ ఏం తలవంపులు వస్తయ్యో? వెళ్లకపోతే—— చూశావా ఊరంతా తరలివచ్చినా తను కదలివచ్చింది కాదు అని నిష్ఠూరం నెత్తిన పడుతుందేమో. తటపటాయిస్తూనే "అంతావెళ్తే మనమూ వెళ్దాంలేవే" అంది సావిత్రమ్మ. శ్యామ పట్టలేని సంబరంతో ఒక్కగంతు వేసింది. "మరి ఎప్పుడు బయల్దేరదామే?" అంటూ తల్లి మెడని చేతుల్తో చుట్టేసి గారాబంగా అడిగింది. మనమూ అందరితోపాటే" అంది సావిత్రమ్మ కూతురు పడే సంబరంచూసి పొంగిపోతూ.

పైకి సరే అన్నప్పటికీ మనస్సు వెనక్కి పీకుతోంది. ఏ ముఖంతో వాళ్ల యింటికి వెళ్లాలి? తమ కష్టసుఖాలలో తొంగి చూసయినా ఎరగని బావగారి గుమ్మం ఎల్లా తొక్కాలి? ఒక్క గర్భవాసానపుట్టిన తమ్ముడే అన్నగారి యింటి చాయలకి వెళ్లి ఎరుగడు. ఇక తన సంగతి చెప్పాలా అన్నగారు చిన్నతనంలోనే గొప్ప శ్రీమంతులకి పెంపుడు పోయాడు. పెద్ద చదువు చదివి

గొప్ప పదవికి అందుకుని బోలెడంత ఆస్తి సంపాదించాడు. తమ్ముడు కాలేజీలోచేరి డబ్బులేక చదువు ఆపివేసి బడిపంతులుగా సొంతవూళ్లోనే వుండిపోయాడు. పని మానేసరికి ఆయన అతికష్టం మీద ఏభై రూపాయలు సంపాయించగలిగాడు. అన్నదమ్ము లిద్దరి మధ్యా దాటటానికి వీలుకానంత అంతరం ఏర్పడింది. ఒక రోజున అన్నగారు ఎవరో పెద్ద అధికార్లతో మాట్లాడుతుండగా దూరంగా తమ్ముడు కనిపిస్తే ఎక్కడ పలకరించి పోతాడో అని ముఖం తిప్పుకొన్నాడట. అప్పట్నుంచీ తమ్ముడు అన్నగారి పేరుకూడా తలంచి ఎరుగడు. ఆ రోజున తమ్ముడిముఖం ఎంత అభిమానంతో జేవురించిందో సావిత్రమ్మకి కళ్లకి కట్టినట్లు కనిపిస్తోంది.

ఉన్నవాటిలో కాస్త మంచిగుడ్డలు ఒక పాతట్రంకుపెట్టెలో సర్దుకుని శ్యామతోపాటు సావిత్రమ్మకూడా బయలుదేరింది. దోవ పొడుగునా శ్యామకి ఒకటే సంబరంగా వుంది. పెద్దనాన్నగారినీ, వారింట్లో జరగబోయే పెళ్లినీ తలచుకుంటూ ఎన్నెన్నో కలలు కంటూ ఒక్క వరుసన తల్లికి కబుర్లు చెప్పేసింది. పసిదాని అమాయకమైన ఉబలాటం ఒకవైపునా, ఎటువంటి ఆదరసత్కారాలు ఎదుర్కొన వలసివస్తుందో అన్న దుడుకు ఒకవైపునా సావిత్రమ్మ మనస్సుని కలవరపెడుతున్నయ్.

అందరితోపాటు సావిత్రమ్మ కూడా ఆడపెళ్లివారి విడిదికి చేరుకుంది. అక్కడ తన నెవరూ పలకరించలేదు. తోడుకోడలు చూసికూడా పలుకరించకుండా విసవిసా వెళ్లిపోయింది. ఎందుకు వచ్చానాఅన్న చిన్నతనంతో సావిత్రమ్మ ప్రాణం చచ్చిపోయింది. తొలుచుకు వస్తున్న కన్నీళ్లని శ్యామ చూచిపోతుందేమోనని గుడ్ల లోనే కుక్కుకుంది. బావగారు పల్లెటూర్నుంచి వచ్చిన చుట్టాలని పేరుపేరునా పలకరిస్తూ శ్యామ దగ్గరకువచ్చి "ఈపిల్ల ఎవరూ?"

అన్నాడు. పక్క నెవరో "మీ తమ్ముడి కూతురు శ్యామ" అని చెప్పటం వినిపించింది. "ఓహో, అల్లాగా" అని మాత్రం అనేసి వెళ్లిపోయాడు. ఈ పిల్ల ఎల్లా వచ్చింది? మరదలు కూడా వచ్చిందా? తమ్ముడు లోకాన్ని విడిచి వెళ్లినా తమ్ముడి ప్రతిబింబంగా వున్న శ్యామని కాస్సేపు పరకాయించి చూసి పలకరించే తీరిక లేకపోయింది కాబోలు! సందడి సమయం. సత్కారాలన్నీ మగపెళ్లివారికి జరగాల్సిందే. ఆడపెళ్లివారి తరుపున వచ్చిన చుట్టాలు అన్నీ సర్దుకు పోవాలి. పెళ్లి బరువు కొంత తమభుజాల మీదకూడా వేసుకుని అటూ ఇటూ తిరుగుతూ వుండాలి. సావిత్రమ్మకి విడిదిలో కూచోటం మనసొప్పలేదు. చేతనైన పనిసాయం తనూచేస్తే బాగుంటుంది. ఇది ఎవరింట్లో పెళ్లి?

ఆ వుద్దేశంతోనే శ్యామని తీసుకొని విడిదిలోంచి బావగారి భవంతిలోకి వెళ్లింది. ఇల్లంతా పట్టుపరికిణీలతోను, సిల్కుగౌన్లతోను, మల్లెపూలతోనూ ముస్తాబయారు. మగపిల్లలు మంచి మెరిసే దుస్తులతో చకచక తిరుగుతున్నారు. ఆ ఇల్లూ; ఆ అలంకరణాలు చూస్తుంటే శ్యామకేకాదు సావిత్రమ్మకికూడా కళ్లుజిగేల్ మన్నయ్.

ఇంతలో గళ్లపట్టు చీరెతో నడిచివస్తున్న పర్వతంలాగా కనిపించింది తోడుకోడలు. పని తొందరమీద పోతున్నట్లుంది. సావిత్రమ్మ "ఇదుగో అక్కయ్యా? గుర్తున్నానా? అల్లా కళ్లప్పగించి చూస్తావేమిటే శ్యామా? అమ్మక్కయ్యకి దణ్ణం పెట్టూ" అంది. శ్యామ చిన్న చేతులుజోడించింది. అమ్మక్కయ్య రోహిణీ కార్తెలో ఎండలాగా శ్యామకేసి చురచురచూసింది. ఆ చూపులకి శ్యామ తాళలేక తల్లిచాటున నక్కింది. "వెళ్లండి. విడిదిలోకి వెళ్లక ఇక్కడెందుకూ?" అని కర్కశ స్వరంతో తోడుకోడలు

అని దులపరించుకొని వెళ్లిపోబోయింది. "ఇది ఎవరింట్లో పెళ్లి అక్కయ్యా? నేను విడిగా విడిదిలో కూచోగలనా? ఏదైనా పని వుంటే చెప్పరాదా అక్కయ్యా?" అని సాయిలా పాయిలాగా అడిగింది. చెబుతుంటే నీక్కాదూ? వెళ్లండి విడిదిలోకి" అని ఒక్క ఝంకీ వినిపించింది. రుసరుసా వెళ్లిపోయింది.

తల్లికి చాటున నక్కిన శ్యామ "అక్కను చూపించవే అమ్మా?" అని అడిగింది, "ఇప్పుడు కాదమ్మా, విడిదిలోకి పోదాంపద" అని సావిత్రమ్మ కూతురు చెయ్యిపుచ్చుకొని బరువుగా అడుగులేసింది. ఆ యింటిలోకి తను రావటం తోడుకోడలికి నామర్దాగా తోచిందని సావిత్రమ్మ తెలుసుకో గల్గింది. అక్కడికి వచ్చిన గొప్పవాళ్లందరి ముందూ తనకి క్షణంకూడా నిలబడే తాహతు లేదన్నమాట. విడిదిలోవుంటే తనసంగతి ఎవరికీ చెప్ప నక్కర్లేదు. అంతగా ఎవరైనా గుచ్చి అడిగితే ఏ వంటమనిషో అని చెప్పి తప్పించుకో వచ్చును. అందుకే తోడుకోడలు తనని నిమిషంకూడా నిలవ నీకుండా విడిదికి తరిమేసింది.

సావిత్రమ్మ మనస్సు విరిగిపోయింది. ముందు వెనుకలు పారజూడకుండా పసిపిల్లతోపాటు తను ఉబలాటపడి రావటమేమటి? ఇల్లా జరుగుతుందని మొదట్నించీ భయపడ్తూనేవుంది. భరించలేని అవమానంతో భగ్గుమన్నది మనస్సు. ఒక్కొక్క అడుగు వేస్తుంటే ఎక్కడికో నేలలోకి అణగారి పోతున్నట్లుగావుంది. తన భర్త బతికివుంటే ఈ పెళ్లికి తరలివచ్చేవాడా? కాని పొరుపులు తుంచుకోటంమంచిదని తను వచ్చింది.వచ్చినందుకు ఇల్లాజరిగింది.

పెళ్లిమంటపం రంగుల దీపాలతో మిలమిల మెరుస్తోంది. సన్నాయి మేళాలు గాలిలో తేలిపోతున్నయ్. ఉన్నవాళ్ల ఇంట్లో పెళ్లికి ఊరందరికీ హడావిడే! ఒకటే జనం.

వచ్చినందుకు పెళ్లికూతుర్నీ పెళ్లికొడుకునీ ఒక్కసారి చూద్దామనుకుంది సావిత్రి. ఆడవాళ్ల సమూహంలోకి జొరబడి సందుచేసుకొని చేతుల్తో శ్యామని ఎత్తి చూపింది. "అదుగో అక్కయ్య! అడుగో బావ" అంటూ కనిపించక పోయిన సంబరంతో చప్పట్లు చరిచింది శ్యామ. మునివేళ్లమీద నిలబడి ముందున్నవాళ్ల తలకాయలమీదినించి మెడపైకెత్తి చూసింది సావిత్రమ్మ పీటలమీది వధూవరుల ముఖాలు కూడా సరిగ్గా కనుపించలేదు. అయినా ఆమెకే తెలియని ఆనందం పొంగివచ్చి ఆ నవదంపతులమీద పన్నీటి జల్లులాగా శుభాశీస్సులని చిలకరించింది. ఇక క్షణంకూడా అక్కడ నిలవటానికి మనసొప్పలేదు. ఎవరో తనని తరుముతున్నట్లుగా వెళ్లిపో వెళ్లిపో అని తోస్తున్నట్లుగా అనిపించింది.

గబగబా విడిదిలోకి వెళ్లింది. ఒకచేత్తో ట్రంకు పుచ్చుకుని, రెండో చేత్తో శ్యామ చెయ్యిపుచ్చుకుని నడిపిస్తూ తమని ఎవరైనా చూసిపోతారేమోనని చీకట్లో నక్కుతూ తలవంచుకుని స్టేషనుకి నడిచింది. రాత్రి పన్నెండింటికి తమ ఊరువెళ్లే రైలు వుంది. అందాకా ప్లాట్‌ఫారంమీదనే కూచోవచ్చు ననిపించింది. ఆ పెళ్లియింటి పరిసరంలో అరనిమిషంకూడా నిలవలేకపోయింది.

సావిత్రమ్మ వెళ్లిపోయిన అరగంట సేపటికి "అయ్యో! అయ్యో! దొంగతనం జరిగింది. పెట్టెలో పట్టుచీరెలూ వొంద రూపాయలూ పోయినై" అంటూ దిక్కులు దద్దరిల్లే కేకలు వినిపించినయ్.

అందరూ గుమికూడారు. తలొక వ్యాఖ్యానం చేస్తున్నారు. తలకొక ఊహాగానం సాగిస్తున్నారు. పెళ్లికూతురు తల్లీ తండ్రీ విడిదిలోకి ఆదరబాదరా పరిగెత్తుకొచ్చారు. వినీ వినటంతోనే

పెళ్లికూతురితల్లి "ఇంకా సందేహం దేనికండీ? ఆ దొంగముండ పనే యిది. తన్ని ఎవరు బొట్టూకాటుకా పెట్టి పిలిచారనో తగుదు నమ్మా అని తయారయింది. నంగనాచిలాగా ఇందాక ఇంట్లోకి వస్తే తరిమేశాను. ముమ్మాటికి ఇది దానిపనే!" అంది. భార్య సిద్ధాంతానికి భర్త తాళం వేశాడు. ఇంతలో ఒకాయన ప్రశ్న చెబుతానని వచ్చాడు. "ఆ సొమ్ము తూర్పు దిక్కుగా పోతోంది. ఇంకా వూరుదాటిపోలేదు" అని ప్రశ్న చెప్పాడు.

"అదుగో చూశారా! సిద్ధాంతిగారూ అదే చెబుతున్నారు. ఆదొంగముండ అంతా పెళ్లి హడావిడిలో మునిగివుండటం చూసి ఇదేసందు అనుకుంది. అన్నీ చక్కబెట్టి ఉడాయించింది. ఏమన్నారు సిద్ధాంతిగారూ? తూర్పు దిక్కుగా పోయిందా సొమ్ము? అయితే తూర్పుదిక్కునేగా రైలు స్టేషను. చూస్తారేం? మను షుల్ని ఉరికించండి. ఆ దొంగముండని జుట్టుపట్టుకుని ఈడ్చుకు రమ్మనండి"

గోడకానుకుని పెట్టెమీద కూచుని రైలుకోసం ఎదురు చూస్తోంది. తల్లి ఒళ్లో తలపెట్టుకుని నిద్రపోతోంది శ్యామ. తన చుట్టూ టార్చిలైట్లతోనూ కర్రలతోనూ జనం చుట్టెయ్యేటం చూడ గానే సావిత్రమ్మకి పై ప్రాణాలు పైనే పోయినయ్. బెదురు చూపులతో గుంపుని కలయజూసి కంపించి పోయింది. గొంతుతడి ఆరిపోయింది. కాళ్లవణికిపోతున్నయ్. "ఉడాయిం చేద్దామనుకుంది దొంగముండ! చూడూ ఏమీ ఎరగని పత్తిత్తులాగా ఎల్లా కూచుందో. అల్లాచూస్తావేం? నిన్నే!" అంటూ ఒక దుండగీడు దురుసుగా ముందుకు వచ్చాడు.

"నన్నా? నన్నేనా?" అంది దీనంగా సావిత్రమ్మ.

"ఆ అడగటం చూడు! టక్కులమారి."

"ఈ నక్కజిత్తులకి మేం లొంగుతామనుకున్నావా ?"

"చూస్తావేం ? ముందు పెట్టెతెరూ !"

"చక్కబెట్టిన వస్తువులన్నీ కక్కితేగాని ఇక్కణ్నించి కదల నివ్వం" అంటూ అన్నివైపులనించీ రివాల్వర్‌లు పేలుతున్నట్లుగా వినిపిస్తున్నాయ్. అసహాయస్థితిలో చిక్కుకున్న సావిత్రి క్షణం సేపు విస్తుపోయింది. ఆక్రోశంతో గుండె పగిలిపోతోంది. అవమానంతో మనస్సు రగిలిపోతోంది. ఆవేశంతో వొంట్లో ప్రతి రక్తనాళమూ వొణికిపోతోంది. "మాటలు జాగర్తగా రానివ్వండి. నేను దొంగని కాను. ఇదుగో నా పిల్లతోడు. నేను ఏమీ ఎరగను" అని ఉద్రేకంతో అరిచింది. తనధైర్యానికి తనే నివ్వెరబోయింది. లోపల ఏదో బడబాగ్నిజ్వాల భగభగ మండుతోంది. భరించలేని అవమానంతో బద్దలయే అగ్నిపర్వతంలాగా సావిత్రమ్మ మనస్సు కుతకుత ఉడికిపోతోంది.

"అంత ఏమీ ఎరుగని దానికి భయం దేనికి ? పెట్టెమీది నించి లేవరాదూ ? అందులో ఏముందో చూపించరాదూ ?" అని ఒక యువకుడు గర్జించాడు. అదంతా మీకనవసరం. నేను దొంగని కాను. నా పిల్లమీద ఒట్టేసి చెబుతున్నాను. అంతకీ మీరు నమ్మకపోతే పదండి. మీవెంట నిర్భయంగా వస్తాను. ఆ పెళ్లి పందిట్లో నలుగురి ముందరా పెట్టె తెరచి చూపిస్తాను. పదండి" అని శ్యామని బుజానవేసుకొని పెట్టె చేత్తో పుచ్చుకొని బయలు దేరింది. ఏదో శక్తి ఆవేసించినట్లుగా అంగలు వేసింది, దెబ్బ తిన్న అభిమానం పడగవిప్పి బుసలుకొడుతోంది. దొంగని పట్టు కోటానికి వచ్చిన వీరులంతా బిత్తరపోతూ, ఆమె వెంట నడిచారు. ఆనాడు తనకి జరగిన ఘోరపరాభవానికి రగిలిపోతూ, అడవుల్లో

అర్ధరాత్రివేళ చెట్లకొమ్మలమీద చిందులుతొక్కే అగ్నిజ్వాలల్లాగా సాగిపోతోంది.

పెళ్లిపందిట్లోకి సుడిగాలిలాగా వెళ్లింది. కంపించే కంఠంతో "రండి. దొంగను పట్టుకునే దొరలంతా రండి" అని కేక పెట్టింది. అంతా ఆ మనిషి రూపాన్ని ఆ కంఠాన్ని చూసి విస్తుపోయారు.

"ఇవిగో విడిదిలో నేను ఎత్తుకుపోయిన వస్తువులు. రండి ఏరుకోండి" అంటూ ట్రంకు మూత తెరిచి పైకెత్తి పట్టుకుంది. అందులోంచి ఒక పాతపంచా, రెండు గౌన్లూ, ఒక పరికిణి జారి కిందపడిపోయినయ్. బుజంమీద శ్యామ నిద్రలేచి ఈ గందరగోళం చూసి 'అమ్మా' అని కెవ్వుమంది.

బావగారి ముఖం పాలిపోయింది. తోడుకోడలు వొంచిన తల ఎత్తలేదు. ఆశ్చర్యంతో నిండిన వెయ్యికళ్లు వీళ్లిద్దరినీ సావిత్రమ్మని రెప్పవాల్పకుండా చూస్తున్నయ్. "ఏం అక్కయ్యా? అనుమానం తీరిందా? ఇక వెళ్లిరానా? శ్యామా, పెదనాన్నగారికి దణ్ణంపెట్టి శలవు తీసుకోవే, పోదాం" అంది సావిత్రి వెటకారం నిండిన స్వరంతో.

శ్యామ చేతులు జోడించి "ఎల్తున్నాం పెదనాన్నగారూ!" అంది. చీమ చిటుక్‌మన్నా వినిపించేటంత నిశ్శబ్దం పెళ్లిపందిట్లో అల్లుకుపోయింది. రాతిబొమ్మల్లాగా బావగారూ తోడుకోడలూ నిలబడిపోయారు.

సావిత్రి రైలుస్టేషనుకు బయలుదేరింది. దిక్కులు చూస్తూ ఏవో మాటలు మాట్లాడుకుంటూ శ్యామ, ట్రంకు చేత్తో పట్టుకొని దూరంగా, ఎర్రగా కనిపిస్తున్న సిగ్నల్‌కేసి చూస్తూ నడుస్తోంది సావిత్రి.